క్లుప్తంగా

వైభవంగా గంధమహోత్సవం

ఉదయగిరి: పట్టణంలోని కోనకాలువ సమీపంలో ఉన్న హజరత్ సూఫీ మహమ్మద్ జైనుల్లా ఉద్దీన్ ఖాదిర్‌పూల్ చిష్టిబాబా (ఆబీద్‌బాబా) 20వ గంధమహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కుదారుల ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఫకీరుల జరబులు, విద్యుద్దీపాలంకరణతో బాణసంచా పేలుళ్ల మధ్య పట్టణ వీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు. గంధోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న ఎస్‌ఐ విజయ్‌శ్రీనివాసులు

వరికుంటపాడు: వరికుంటపాడు నూతన ఎస్‌ఐగా విజయ్ శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వీఆర్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడ నియమించబడ్డారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ కావలి వన్‌టౌన్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు సన్మానించి వీడ్కోలు పలికారు.

మస్టర్లు సకాలంలో అప్‌లోడ్ చేయాలి

ఉదయగిరి: సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఉపాధి హామీ పనులకు సంబంధించిన కూలీల మస్టర్లు ఎప్పటికప్పుడు సకాలంలో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ప్రభుత్వం రూ.272 కూలీ నిర్దేశించిందన్నారు. కూలీలకు కొలతల ప్రకారం పనులు కేటాయించి గిట్టుబాటు కూలి అందేలా చూడాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధం

మర్రిపాడు: మండలంలో రైతులకు అవసరమైన మేర పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు. మర్రిపాడు ఆర్బీకేలో సోమవారం ఆయన రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం జీలగలు, జనుములు, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులకు రైతు భరోసా రాని వారు కొత్తగా నమోదు చేసుకునే అవకాశముందన్నారు. రైతు భరోసా తీసుకుంటూ కుటుంబ పెద్ద ఎవరైనా మృతి చెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రం నామినీ పత్రంతో పేరు నమోదు చేసుకోవచ్చునన్నారు. మండలంలో 1,017 మంది రైతులకు పీఎం కిసాన్ 13వ విడత నగదు రైతుల ఖాతాల్లో జమ కాలేదని, అలాంటి వారు ఈ నెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.


'గురుకులం' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో, 6,7 తరగతుల్లో బ్యాక్‌లాక్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులని, 80 ఖాళీలు, ఆరో తరగతిలో 1, 7వ తరగతిలో 3 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు 24వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

నిరసనలోనూ వర్గపోరు

ఆత్మకూరు: నాయకత్వలేమితో దిశానిర్దేశం లేక కొట్టుమిట్టాడుతున్న టీడీపీ పరిస్థితి ఆ నాయకుల విభేదాలతో రోజురోజుకు మరింత దిగజారిపోతుంది. సోమవారం విద్యుత్ చార్జీలపై ఆందోళన నిర్వహించాలని ఆ పార్టీ హైకమాండ్ ఆదేశాలు జారీ చేస్తే మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి వర్గం విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డీఈ జనార్దన్‌కు వినతి పత్రం అందజేసి వెళ్లింది. అనంతరం కన్నబాబు వర్గీయులు నిరసన వ్యక్తం చేసేందుకు వచ్చి చేయకుండానే వెనుదిరిగారు. నిరసన కార్యక్రమాల్లోనూ ఎవరి వారే యమునా తీరే అనే రీతిలో తెలుగు తమ్ముళ్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఇఫ్తార్ విందు



ఆత్మకూరు: పట్టణంలోని ఉలవదిబ్బ జామియా మసీదు వద్ద మైనార్టీ సోదరులకు వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో కఠోర నిబంధనలతో ఉపవాస దీక్షలు నిర్వహించే ముస్లింల కోసం డాక్టర్ శ్రావణ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడాన్ని ఆయన అభినందించారు.

కట్టారు.. వదిలేశారు..

దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఆత్మకూరు గ్రామీణ మండల కేంద్రంగా ఉండేది. ఇక్కడే నివాసాలు ఉండి.. ఉద్యోగ కార్యకలాపాలు నిర్వర్తించడానికి సుముఖంగా లేని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వీరి పాలనా వ్యవహారాల కోసం రూ.లక్షలు పెట్టి నిర్మించిన భవనాన్ని నెల్లూరులోని జిల్లా కార్యాలయంలో ఇరుకు గదుల్లో విధులు నిర్వహించడం ప్రారంభించారు. దశాబ్దాలుగా గడుస్తున్నా.. ఇప్పటికీ ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. నెల్లూరులోనే కొలువులు కావడంతో పోస్టింగ్‌లు సైతం ఇక్కడే కొనసాగుతుండడంతో హెచ్‌ఆర్‌ఏ రూపంలో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

- మూడు దశాబ్దాలకు పైగా నిరుపయోగం
- పీఆర్ పీఐయూ విభాగానికి చెందిన విలువైన భవనం శిథిలం
- విలాస జీవితానికి అలవాటుపడి నెల్లూరు నుంచి కార్యకలాపాలు


నెల్లూరుపాళెంలో 67వ జాతీయ రహదారి పక్కన చుట్టూ ముళ్ల పొదలతో నిండిన పంచాయతీ రాజ్‌శాఖ భవన సముదాయం

ఆత్మకూరురూరల్: గ్రామాణాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే పంచాయతీరాజ్‌శాఖ డివిజన్ కేంద్రం ఆత్మకూరు విభాగం దశాబ్దాల కాలంగా జిల్లా కేంద్రంలోని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఈ శాఖ కార్యకలాపాలు కొనసాగించేందుకు అనువుగా అప్పట్లో రూ.లక్షల నిధులు వెచ్చించి విశాలమైన వసతులతో భవనాన్ని అప్పటి ప్రభుత్వం నిర్మించి ఇచ్చింది. ఆత్మకూరు సబ్ డివిజన్ కార్యాలయంలో రెగ్యులర్ విభాగానికి సంబంధించిన వారు మాత్రం ఇక్కడే విధులు నిర్వహిస్తుండగా, పీఐయూ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది మాత్రం తమ కార్యకలాపాలు నిర్వహించడానికి భవన వసతి లేదని నెల్లూరులోని పంచాయతీరాజ్ కార్యాలయంలో కూర్చొని కొలువులు చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వం మంజూరు చేసే పనులు ప్రాజెక్ట్ డివిజన్ విభాగం గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు, మెటల్ రోడ్లు, పంచాయతీ భవనాలు నిర్మిస్తారు. గ్రామాలను అనుసంధానిస్తూ నిర్మించే తారురోడ్లు, వంతెనలు, సిమెంట్ రోడ్లు వంటి నూతన నిర్మాణాలు పీఐయూ విభాగం వారి పర్యవేక్షణలో నిర్వహిస్తుంటారు. క్షేత్ర స్థాయిలో చేపట్టే నిర్మాణాలను ప్రతి నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు నెల్లూరులో ఉండి శాఖ పరమైన కర్యకలాపాలు నిర్వహిస్తుండడంతో పనుల నాణ్యతలో సరైన ప్రామాణికత లేకపోవడంతో టీఏ, డీఏ రూపంలో అనవసరమైన బిల్లులు పెట్టుకుని ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

రూ.కోట్ల విలువైన భవనం

పంచాయతీరాజ్‌శాఖకు చెందిన కోట్లాది రూపాయల విలువైన స్థలం.. అందులో సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడం ఆ శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్టగా ఉందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెంలో 67వ నంబరు జాతీయ రహదారి పక్కన సుమారు ఎకరా స్థలం 30 ఏళ్ల క్రితం వరకు అధికారులు కార్యకలాపాలతో పాటు రోడ్లు, భవనాల నిర్మాణాల్లో వినియోగించే సామగ్రి నిల్వ చేసే గోడౌన్లుగా ఉండేది. ఇక్కడ కార్యకలాపాలను నిర్వహించడాన్ని అధికారులు గాలికి వదిలేయడంతో ఈ స్థలంలో ముళ్ల పొదలు ఏపుగా పెరిగి విష సర్పాలకు నిలయంగా మారింది. పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న ప్రజలకు ఈ పరిస్థితి ప్రాణసంకటంగా తయారైంది. శిథిలావస్థకు చేరిన పంచాయతీరాజ్ భవన సముదాయానికి పక్కనే రోడ్లు, భవనాలశాఖ కార్యాలయ భవనం, అతిథిగృహం కూడా ఉంది. ఇప్పటికీ ఆ శాఖ అధికారులు ప్రజలకు చక్కగా సేవలు అందిస్తున్నారు. ఇంచుమించుగా ఒకేసారి నిర్మించిన ఈ రెండు భవన సముదాయాల్లో పంచాయతీరాజ్ భవనం మాత్రం శిథిలావస్థకు చేరడం, పరిసరాల్లో ఉన్న ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించడం వెనుక శాఖాపరమైన తీవ్ర నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి.


పీఆర్ భవన సముదాయం పక్కనే వినియోగంలో ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం, అతిథి గృహం

ప్రభుత్వ ఖజానాకు చిల్లు

పీఆర్ పీఐయూ విభాగం అధికారులు నెల్లూరు నుంచి కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. ఈ ప్రాంతంలో విధులకు హాజరు కావడానికి టీఏలు, డీఏలతో పాటు జిల్లా కేంద్రం అదనంగా హెచ్‌ఆర్‌ఏ కూడా దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీరాజ్ శాఖ విలువైన స్థలంతో పాటు అందులోని భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత వర్గాల వారు కోరుతున్నారు.

విద్య, ఉపాధి కల్పనే ధ్యేయం


ఆత్మకూరు మోడల్ గిరిజనకాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: యువతకు విద్యతో పాటు ఉపాధి కల్పించడం, అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 3, 4, 21 వార్డుల్లో సోమవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఆ వార్డుల సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం 21వ వార్డు పరిధిలోని గిరిజనకాలనీ, ఉలవదిబ్బ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు అందిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. జగనన్న పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలు సంతృప్తికరంగా ఉన్నట్లు చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. స్థానికంగా డ్రైనేజ్, అంతర్గత సిమెంట్ రోడ్ల అడిగిన వారికి త్వరలోనే ఆ పనులు నిర్వహించనున్నట్లు అధికారులను అడిగి తెలుసుకుని వారికి హామీ ఇచ్చారు. కొందరు తమ స్థలాల్లో ఇంటి నిర్మాణాలు సొంతంగా చేసుకుంటామని కోరగా గృహ నిర్మాణశాఖ డీఈ నటరాజ్‌తో చర్చించారు. ఆ మేరకు అనుమతులు ఇప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి రూ.లక్ష తక్కువ కాకుండా సంక్షేమ ఫలాలు అందిన విషయాన్ని లబ్ధిదారులే స్వయంగా తెలిపారన్నారు. మరో రెండు నెలల్లో భారీ జాబ్‌మేళా యువత ఉపాధి కల్పన కోసం నిర్వహించనున్నట్లు తెలిపారు. జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను ఇళ్ల గోడలకు అంటించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ కోడూరు కౌసల్యమ్మ, ఐవీ రమణారెడ్డి, షేక్ పర్వీన్, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, కేతా రవి, షేక్ రహీం, జమీర్, రిజ్వాన్, కలాం, షబ్బీర్, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పులివాహనంపై ఆది దంపతులు

సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు సోమవారం స్వామి అమ్మవార్లకు పులివాహన సేవ జరిగింది. అర్చకులు, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పులి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.


పులి వాహనంపై దేవదేవేరులు

రేపటి నుంచి కాలువలకు నీరు నిలిపివేత

ఉదయగిరి: రబీ క్రాఫ్ సీజన్ ముగియడంతో మండలంలోని గండిపాళెం జలాశయం ప్రాజెక్ట్ కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా విడుదల అవుతున్న నీటిని బుధవారం నుంచి నిలుపుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ డీఈ సాయిశంకర్‌నారాయణ అన్నారు. ఆయన జలాశయంలో సోమవారం నీటి మట్టాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. ఆయన మాట్లాడుతూ జలాశయంలో నీటిమట్టం తక్కువగా ఉండడం, క్రాఫ్ సీజన్ ముగియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని నిలిపివేస్తున్నామన్నారు. ఆయకట్టు రైతులు సహకరించాలన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న డీఈ

'వాత్సల్య'తో చిన్నారుల ఉజ్వల భవిష్యత్

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశ పెడుతుందని ఈ పథకంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్ అన్నారు. ఆత్మకూరు సీడీపీఓ కార్యాలయంలో సెక్టార్ పరిధిలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో సోమవారం పథకంపై సీడీపీఓ జైనకుమారి అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారి సురేష్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి 18 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వారికి తల్లిదండ్రులు లేకున్నా, విడాకులు తీసుకున్న తల్లుల పిల్లలు, అనాథ పిల్లలు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, ప్రకృతి శారీరికంగా దెబ్బతిన్న పిల్లలు, హెచ్ఐవీ బారిన పడిన పిల్లలు, అంగ వైకల్యం కలిగిన పిల్లలు ఈ పథకానికి అర్హులని ఆయన తెలిపారు. ఒక్కొక్క కుటుంబం నుంచి అర్హతలున్న ఇద్దరు పిల్లలున్నా ఈ వాత్సల్య స్కాలర్‌షిప్ వర్తిస్తుందన్నారు. నెలకు రూ.4 వేలు చొప్పున ఆ చిన్నారుల బ్యాంకు ఖాతాలకు నగ దు అవుతుందని తెలిపారు. కరోనా మహమ్మారి బారి న పడి తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అర్హులేనని వివరించారు. 15వ తేదీ వరకు దరఖాస్తులు నమోదు చేసేందుకు గడువు పెంచిందన్నారు. అసిస్టెంట్ సీడీపీ ఓ సునీలత, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రత్నమ్మ, నారాయణమ్మ, కస్తూరి, నాగేశ్వరి, నిర్మల రులు పాల్గొన్నారు.



నాణ్యమైన విద్యాకానుక కిట్లు

- ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు

సోమశిల: జగనన్న విద్యాకానుక కిట్లు నాణ్యతగా ఉంటేనే విద్యార్థులకు అందజేస్తామని, అందులో రాజీపడే ప్రసక్తే లేదని గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన అనంతసాగరం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి అనంతరం విద్యావనరుల కేంద్రంలో ఉద్యోగులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విద్యాకానుక కిట్లు పాఠశాలలు ప్రారంభించబడిన వెంటనే విద్యార్థులకు అందించేలా ప్రత్యేక టీంలు ద్వారా అందించేలా చర్యలు తీసుకొంటున్నట్లు స్పష్టం చేశారు. పక్కా ప్రణాళికతో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరిగేలా దృష్టి సారించామని, ఇందుకు అనువైన మార్గదర్శకాలు అధికారులకు సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు

మట్టి నమూనాలపై అవగాహన

చేజర్ల: మట్టి నమూనాలు సేకరణ, వాటి ఆవశ్యకతపై జిల్లా వనరుల కేంద్రం (డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కో–ఆర్డినేటర్) సత్యవాణి పలు సూచనలు చేశారు. సోమవారం మండలంలోని చేజర్ల, మడపల్లి ఆర్బీకేలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాల ప్రయోజనాలు వివరించారు. ఏ పంటకు ఎంత లోతులో మట్టి నమూనాలు ఎక్కడ తీయాలి, ఎక్కడ తీయకూడదో వివరించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ ఏఓ శ్రీదేవి మాట్లాడుతూ పొదలకూరులోని ల్యాబ్‌లోనే ఈసారి పట్టి పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ శశిధర్, డీఆర్‌సీ ఏఓ చక్రవర్తి, వీఏఏలు ఎస్ మమత, ఏ మమత పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



చేజర్ల: ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. మండలంలోని చేజర్ల, బోడిపాడు, చేజర్ల కండ్రిక, చీర్లవారికండ్రిక గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానసమితి పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఈ ప్రచారం జరిగింది. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞాన ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలకు తొలగించడానికి ఈ సిద్ధాంతం తోడ్పడుతుందని వేదిక పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమలో పెంచలయ్య, మధు, కొండయ్య, మాళవిక, నరసారెడ్డి, భాగ్యమ్మ, సుధాకరాచారి పాల్గొన్నారు.

'జగనన్నే మాభవిష్యత్'

- ప్రతి గడపలో మెగా పీపుల్స్ సర్వేలో వెల్లడవుతున్న ప్రజాభిప్రాయం

కావలి: జగనన్నే మా భవిష్యత్ అని ప్రతి గడప నినదిస్తోంది. మెగా పీపుల్స్ సర్వేలో తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. కావలి నియోజకవర్గంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ఉధృతంగా సాగుతోంది. గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు ఆటోడ్రైవర్లు, ఆసరా ద్వారా స్వయం పొందుతున్న మహిళలు, సామాజిక పింఛన్లతో మలి సంధ్యలో నిశ్చింతగా జీవనం సాగిస్తున్న అవ్వాతాతలు, ఇలా భిన్నవర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమంలో పాల్గొని మద్దతు తెలుపుతున్నారు. ప్రధానంగా పీపుల్ సర్వే ద్వారా ప్రజామద్దతు పుస్తకంలో తమ అభిప్రాయాలు వెల్లడించడంతో పాటు మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా సంపూర్ణంగా మద్దతు తెలిపి ఇంటి గడపలకు, సెల్‌ఫోన్లకు జగనన్న చిరునవ్వుతో కూడిన స్టిక్కర్లు అంటించుకుంటున్నారు. కావలి పట్టణం, కావలి రూరల్ మండలంలో పాటు అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాల్లోని అన్ని గ్రామాల్లో పండగలా పీపుల్స్ సర్వే జరుగుతోంది. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ పీపుల్స్ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన పేదలు స్వచ్ఛందంగా సర్వేలో పాల్గొని ప్రజామద్దతు పుస్తకంలో అభిప్రాయాలు వెల్లడించడంతో పాటు గృహసారథులకు తోడుగా లబ్ధిదారులు కూడా ఇంటింటికి తిరుగుతూ 'జగనన్నే మానమ్మకం' అనే నినాదం వినిపిస్తున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలు, తీరప్రాంత గ్రామాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. గ్రామాల్లో పథకాల ద్వారా లబ్ధిపొందిన పేదలంతా నిండు మనస్సుతో ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారు.


కావలిలో మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను


బీరంగుంటలో జగనన్న నువ్వే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

అల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ దండా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బీరంగుంటలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం సాయికుమార్, ఉస్మాన్, సురేంద్ర, భాస్కర్, శ్రీనివాసులు, నరసింహారావ్, సాయిచరణ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ముమ్మరంగా..


చేజర్ల: ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు


ఆత్మకూరురూరల్:బట్టేపాడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఊరూరా జగనన్నే మా భవిష్యత్తు

మర్రిపాడు: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గ్రామగ్రామాన ముమ్మరంగా జరుగుతోంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్నారు. తమ ఇళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌ను స్వచ్ఛందంగా అతికించుకోవడంతో పాటు సెల్‌ఫోన్లకు మరో స్టిక్కర్‌ను కూడా అంటించుకుంటున్నారు.

చేజర్ల: మండలంలోని కాకివాయిలో స్థానిక వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగా నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులో సోమవారం జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఆత్మకూరు బుజ్జమ్మ, ఉపసర్పంచ్ పాలపాటి నాగార్జునరెడ్డి, కన్వీనర్ పాలపాటి సుజాతమ్మ, గృహసారథులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను వారితోనే అంటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కొనసాగింది. బట్టేపాడులో సొసైటీ అధ్యక్షుడు వాసిపల్లి లక్ష్మీరెడ్డి, సర్పంచ్ చెరుకూరు చిన్నచెంచయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి రవికుమార్, యర్రగుంట పెంచలయ్య, దొరబాబు, కరటంపాడులో సచివాలయ కన్వీనర్ రఫీ, తిరుమల, బోయలచిరివెళ్లలో సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ రావూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరికుంటపాడు: ప్రభుత్వ పథకాల గురించి వివరించి కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

కలిగిరి: మండలంలోని తెల్లపాడులో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి అవగాహన కల్పించారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు మారేళ్ల మధుసూదన్‌రెడ్డి, వెంగళరెడ్డి, హజరత్‌రెడ్డి, అంకిరెడ్డి, ఇర్మియ, తిరుపాలు, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలం టి.కొండారెడ్డిపల్లిలో సోమవారం జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, గృహసారథులు, స్థానిక నేతలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పథకాల పట్ల సంతృప్తి చెందిన విషయంపై ఫోన్ కాల్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ప్రభుత్వ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుంటామని ముక్తకంఠంతో చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు ఆంద్రా బాలగురవారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నేతలు గంగవరపు పుల్లయ్య, పాలకొల్లు విజయభాస్కర్‌రెడ్డి, బొమ్ము వెంకటరెడ్డి, భోగ్యం విజయ, రామచంద్ర, మురళి, ఓబుల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో చేపల వేటపై నిషేధం

కావలి: సముద్ర జలాల్లో చేపలు, రొయ్యల సంతానోత్పత్తి సమయం కావడంతో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు వేట నిషేధం అమలు చేస్తున్నట్లు మత్స్యశాఖ కావలి సహాయ సంచాలకులు శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకనైజ్డ్, మోటార్ బోట్లతో వేట నిషేధాన్ని కఠినంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. మత్స్యసంపద పరిరక్షించేందుకు అమలు చేస్తున్న వేట నిషేధం పక్కాగా అమలయ్యేలా మత్స్యకారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిషేధాన్ని ఉల్లంఘించి వేట సాగిస్తే బోట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించడం, డీజిల్ రాయితీని రద్దు చేయడం జరుగుతుందన్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా దిలీప్‌కుమార్

చేజర్ల: బుచ్చిరెడ్డిపాళెం ఎంఈఓ ఎం.దిలీప్‌కుమార్‌కు చేజర్ల ఎంఈఓ (ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఈ మేరకు డీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన త్వరలో ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ ఎంఈఓ పనిచేస్తున్న కళాధర్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారు.

పరీక్ష రాస్తుండగా విద్యార్థికి అస్వస్థత

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తూ విద్యార్థి అస్వస్థతకు గురైన ఘటన సోమవారం జరిగింది. విశ్వనాథరావుపేటకు చెందిన సంతోష్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తుండగా మధ్యలో అస్వస్థతకు గురయ్యాడు. వేసవి తీవ్రత, ఒత్తిడి కారణంగా అస్వస్థతకు గురవడంతో వెంటనే అక్కడే ఉన్న వైద్య సిబ్బంది స్పందించి ప్రాథమిక చికిత్స అందించారు. కొద్దిసేపటి తర్వాత విద్యార్థి కోలుకుని పరీక్ష పూర్తి చేశాడు.